


జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట





బుధవారం, జూలై 8, 2026 పేజీలు : 7


## చిన్నారుల బలమైన విద్యా పునాదులకు

# నూతన అడుగు

### - బోయపల్లిలో శిక్షణ ఫౌండేషన్ కార్యక్రమాన్ని పరిశీలించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా




**మహబూబ్‌నగర్, జూలై 7 ( ప్రజా జ్యోతి బ్యూరో )** జిల్లాలో చిన్నారుల ప్రాథమిక విద్యా నైపుణ్యాలను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమలు చేయనున్న ప్రీ-లిటరసీ, ప్రీ-న్యూమరసీ ఆధారిత బేసిక్ లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్‌లోని బోయపల్లి అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను సందర్శించి కార్యక్రమం అమలు విధానాన్ని తెలుసుకున్నారు.

శిక్షణ ఫౌండేషన్ ప్రతినిధులు కలెక్టర్‌కు కార్యక్రమం వివరాలను తెలియజేస్తూ, జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా 50 అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేసి చిన్నారుల్లో ప్రీ-లిటరసీ, ప్రీ-న్యూమరసీ, మోటార్ స్కిల్స్ అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.

## ఓటర్లు పూరించిన పత్రాలను ఆన్ లైన్‌లో

# నమోదు చేయాలి

### నారాయణపేట జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక



నారాయణపేట ప్రతినిధి జూలై 07 (ప్రజా జ్యోతి) ఓటర్ల నుంచి పూరించిన ఎన్యూమరేషన్ పత్రాలను సేకరించి వాటిని వెంటనే ఆన్ లైన్ లో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక బీ ఎల్ వో లను ఆదేశించారు. బీ ఎల్ వో లు ఓటర్ల ఇళ్లకు స్వయంగా వెళ్ళి ఎన్యూమరేషన్ పత్రాలను సేకరించాలని, పత్రాలు నింపడం తెలియని ఓటర్లకు దగ్గరుండి సహకారం అందించాలని సూచించారు. మంగళ వారం నారాయణపేట మండలంలోని చిన్న జట్రమ్, కొల్లంపల్లి, లింగంపల్లి గ్రామాలలో కలెక్టర్ పర్యటించి బూత్ స్థాయి అధికారులు,

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రజలందరూ సహకరించాలి

-మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి - ఆపరేషన్ ముస్కాన్--12 పోస్టర్ల ఆవిష్కరణ



## గ్రామ పంచాయతీలే

# గ్రామాభివృద్ధికి పునాది

**మహబూబ్‌నగర్, జూలై 7 ( ప్రజా జ్యోతి బ్యూరో )** గ్రామ పంచాయతీలను ఆర్థికంగా, పరిపాలనాపరంగా బలోపేతం చేసి గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ, మహిళా--శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక ను సమర్ధవంతంగా అమలు చేసి, 16వ ఆర్థిక సంఘం నిధులను పారదర్శకంగా వినియోగించాలని అధికారులను ఆదేశించారు.మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

### సమగ్ర అభివృద్ధి ప్రణాళికను సమర్థంగా అమలు చేయాలి.. సర్పంచులు, కార్యదర్శులకు మూడు రోజుల ప్రత్యేక శిక్షణ: మంత్రి సీతక్క



# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రజలందరూ సహకరించాలి

**మహబూబ్‌నగర్, జూలై 7 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల హక్కుల పరిరక్షణ లక్ష్యంగా చేపడుతున్న ఆపరేషన్ ముస్కాన్--12 కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ దరావత్ జానకి మంగళవారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జూలై 1 నుంచి జూలై 31 వరకు నిర్వహిస్తున్న ఆపరేషన్ ముస్కాన్--12లో భాగంగా 18 సంవత్సరాల లోపు బాలబాలికలను గుర్తించి, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా, బలవంతపు భిక్షాటన, గృహ పనులు, ఇతర ప్రమాదకర పనుల్లో నిమగ్నమైన చిన్నారులను రక్షించి తిరిగి విద్యా సంస్థల్లో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టవిరుద్ధమని, అలా చేసే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి చిన్నారికి విద్యను అభ్యసించే హక్కు ఉందని, ఆ హక్కును కాపాడటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే వెంటనే పోలీసు శాఖ, చైల్డ్‌లైన్ లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బాలల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ ఆపరేషన్ ముస్కాన్--12 కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ రమణ రెడ్డి, సీడబ్ల్యూసీ చైర్మన్ నయీముద్దీన్, కార్మిక శాఖ అధికారులు, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీలే గ్రామాభివృద్ధికి పునాది

ఈ సమావేశానికి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రతి గ్రామ పంచాయతీ ప్రజల అవసరాలకు అనుగుణంగా సమగ్ర అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. గ్రామాల అవసరాలను స్థానికంగానే గుర్తించి, దీర్ఘకాలిక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు.

గ్రామస్థాయిలో ఖర్చు చేసే ప్రతి రూపాయి ప్రజల సంక్షేమానికే వినియోగించాలని, నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని ఆదేశించారు. 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగ మార్గదర్శకాలను తప్పనిసరిగా అనుసరిస్తూ గ్రామాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు.

జూలై 8 నుంచి జిల్లాల వారీగా మూడు రోజుల పాటు సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులకు సమగ్ర శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి తెలిపారు. గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, గ్రామ పాలన, ఆర్థిక నిర్వహణ, చట్టపరమైన అంశాలపై విస్తృతంగా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. వీబీజీ రామ్--జీ చట్టంపై ప్రతి సర్పంచ్, కార్యదర్శికి పూర్తి అవగాహన కల్పించాలని, గ్రామస్థాయిలో చట్టబద్ధమైన పాలనకు ఇది అవసరమని పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమాలకు సర్పంచులు, కార్యదర్శులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని, నీటి కొరత లేదా ఇతర సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొంటూ, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జడ్పీ సీఈఓ, ఇన్‌చార్జి డీపీఓ వెంకటరెడ్డి, డీఆర్‌డీఓ నర్సింహులు, మిషన్ భగీరథ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చిన్నారుల బలమైన విద్యా పునాదులకు నూతన అడుగు

అంగన్‌వాడీ కేంద్రాలకు ట్యాబ్‌లు, బ్లూటూత్ స్పీకర్లు, టీచింగ్-లెర్నింగ్ మెటీరియల్, స్టేషనరీతో పాటు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 'ప్రియదర్శిని' పాఠ్యాంశాలకు అనుగుణంగా 'శిశు వికాసన' పేరుతో ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించి, అవసరమైన ఆడియో కంటెంట్‌ను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. ఉపాధ్యాయులు ప్రతిరోజూ నిర్వహించాల్సిన బోధనా కార్యక్రమాలు యాప్‌లో ఉండటంతో చిన్నారులకు సులభంగా, ఆసక్తికరంగా బోధన అందించవచ్చని తెలిపారు.

పాఠశాలల్లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ మెరుగుదలకు 'ప్రేరణ ఎఫ్ ఎల్ ఎన్ 'కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల హాజరు, తరగతి గది కార్యకలాపాల్లో చురుకైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు స్టార్ అవార్డులు, బ్యాడ్జ్‌లు, గ్రూప్ యాక్టివిటీలు, బాధ్యతల కేటాయింపు వంటి వినూత్న విధానాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే విద్యార్థుల అభ్యాస పురోగతిని అంచనా వేసేందుకు పిక్టోరియల్ ప్రోగ్రెస్ కార్డులు, తెలుగు, ఇంగ్లీష్, గణితం సబ్జెక్టులకు సంబంధించిన ఫౌండేషనల్ లెర్నింగ్ పుస్తకాలను అందిస్తున్నట్లు వెల్లడించారు.

ఆశ్రేయ హస్త ట్రస్టు దాతల సహకారంతో శిక్షణ ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని 2026 నుంచి 2029 వరకు మూడు సంవత్సరాల పాటు అమలు చేసి పూర్తి సహకారం అందించనున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులతో మాట్లాడిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఈ కార్యక్రమం ద్వారా చిన్నారుల అభ్యాస నైపుణ్యాలు గణనీయంగా మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అవసరమైన అనుమతులు మంజూరు చేస్తామని, ఒకటి లేదా రెండు నెలల తర్వాత కార్యక్రమం పురోగతిని ప్రజలకు తెలియజేసేలా ప్రత్యేక సమీక్షా కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. శిక్షణ ఫౌండేషన్ చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా కొనసాగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జరీనా బేగం, ఎంఈఓ లక్ష్మణ్ సింగ్, శిక్షణ ఫౌండేషన్ సీనియర్ ఆపరేషన్ మేనేజర్ కాశీనాథ్, జిల్లా మేనేజర్ యాదప్ప, గంగయ్య తదితరులు పాల్గొన్నారు

## ఓటర్లు పూరించిన పత్రాలను ఆన్ లైన్‌లో నమోదు చేయాలి

సూపర్ వైజర్ల పనితీరు, జిల్లాలో కొనసాగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. చిన్నజట్రశీ గ్రామానికి సంబంధించి పోలింగ్ స్టేషన్ నం. 176,177, కొల్లంపల్లి గ్రామానికి సంబంధించి పోలింగ్ స్టేషన్ 182 నుంచి 186, అలాగే లింగం పల్లి గ్రామానికి సంబంధించిన 187 పోలింగ్ స్టేషన్ ల వారీగా ఇంతవరకు ఎన్ని ఎన్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేశారు ? అందులో ఎన్ని పత్రాలను తిరిగి తీసుకున్నారు ? ఇంకా ఎన్ని తీసుకోవాల్సి ఉందనే వివరాలను ఆయా బీ ఎల్ వో లను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లు ఎన్యూమరేషన్ పత్రాలను నింపి బీ ఎల్ వో లకు తిరిగి ఇస్తేనే ఓటరు జాబితాలో పేరు ఉంటుందని, ఇవ్వక పోతే జాబితాలో పేరు ఉండదు అని ఆమె స్పష్టం చేశారు. చనిపోయిన ఓటర్ల పేర్లు, డబుల్ ఓట్లు తొలగించాలన్నారు.

జిల్లాలోని బీఎల్ వోలు ఇక నుంచి రోజుకు భర్తీ చేసిన వంద ఎన్యూమరేషన్ పత్రాలను తిరిగి తీసుకుని, ఆన్ లైన్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అమరేంద్ర కృష్ణ, సూపర్ వైజర్లు, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

## బాచారం లోని ప్రజల స్వచ్ఛంద పునరావాస కాలనీని సందర్శించిన కలెక్టర్

నాగర్ కర్నూల్ జూలై 07

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని అటవీ గ్రామాల ప్రజల స్వచ్ఛంద పునరావాసం కోసం నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం బాచారం గ్రామం వద్ద నిర్మిస్తున్న పునరావాస (ఆర్, ఆర్) కాలనీ పనులను, కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

సార్లపల్లి, కుడిచింతల బైలు, తాటిగుండాల పెంట, కొల్లంపెంట గ్రామాలకు చెందిన ఫేజ్--× (ఆప్షన్--××) లబ్ధిదారుల కోసం ఏర్పాటు చేస్తున్న కాలనీకి సంబంధించిన సమగ్ర లేఅవుట్ మ్యాప్‌ను కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ప్రతి లబ్ధిదారునికి గృహ స్థలాలు, విశాలమైన అంతర్గత రహదారులు, తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, పారిశుద్ధ్య సదుపాయాలు, వర్షపు నీటి పారుదల వ్యవస్థలను నాణ్యతతో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, ఆరోగ్య ఉపకేంద్రం, కమ్యూనిటీ హాల్, గ్రామ పరిపాలనా కార్యాలయం, రేషన్ దుకాణం, పార్కు, ఆట స్థలం వంటి సామాజిక మౌలిక సదుపాయాలను సమగ్ర ప్రణాళికతో అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా కాలనీని అన్ని సౌకర్యాలతో ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లోని అటవీ గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా పునరావాసాన్ని ఎంచుకున్న నేపథ్యంలో, వారికి కొత్త ప్రాంతంలో మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. విద్య, వైద్యం, తాగునీరు, రవాణా, విద్యుత్, ఉపాధి అవకాశాలు వంటి అన్ని ప్రాథమిక సేవలు సులభంగా అందుబాటులో ఉండేలా కాలనీని అభివృద్ధి చేయాలని సూచించారు.పునరావాస కాలనీ అభివృద్ధిలో అటవీ, రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, రోడ్లు మరియు భవనాల శాఖలు సమన్వయంతో పనిచేసి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు లబ్ధిదారుల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలను అమలు చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు ప్రతిపాదిత లేఅవుట్, ప్లాట్ల విభజన, రహదారుల నిర్మాణం, తాగునీటి వనరులు, విద్యుత్ కనెక్షన్లు, ప్రజా వినియోగ స్థలాల కేటాయింపు తదితర అంశాలను కలెక్టర్‌కు వివరించారు. అవసరమైన చోట మార్పులు చేసి లబ్ధిదారులకు మరింత అనుకూలంగా కాలనీ రూపకల్పన చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ వెంట అటవీ శాఖ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు



# రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటనకు సర్వం సిద్ధం

## -ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డితో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

**నాగర్ కర్నూల్ :జులై 07 (ప్రజా జ్యోతి)**

రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లాలో చేపట్టనున్న పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టిందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అన్నారు.పర్యటనలో నిర్వహించనున్న ప్రారంభోత్సవాలు,శంకుస్థాపనలు,ప్రజా ఇతర కార్యక్రమాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్,ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి తో కలిసి మంగళవారం పరిశీలించారు.మొదటగా నాగర్‌కర్నూల్ పట్టణంలో నూతనంగా నిర్మించిన జిల్లా రవాణా శాఖ (ఆర్టీఓ) కార్యాలయ భవనాన్ని సందర్శించిన కలెక్టర్,ప్రారంభోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను కార్యక్రమ వేదిక,అతిథుల కూర్చునే ఏర్పాట్లు,పార్కింగ్,తాగునీరు,విద్యుత్ సరఫరా,పారిశుధ్యం,మీడియా ప్రతినిధులకు అవసరమైన సౌకర్యాలు,ప్రజల రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించిఅనంతరం నాగర్‌కర్నూల్ పట్టణంలో నూతనంగా నిర్మించనున్న ఆర్టీసీ బస్ స్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన స్థలాన్ని పరిశీలించి శంకుస్థాపన కార్యక్రమం నిరాటంకంగా జరిగేలా స్థలాన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేసే ఏర్పాట్లు,వాహనాల పార్కింగ్,ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బుధవారం నాగర్ కర్నూల్ జిల్లాలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటనలో ఎలాంటి చిన్నపాటి లోపం కూడా జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కార్యక్రమాల నిర్వహణలో ప్రభుత్వ ప్రోటోకాల్ నిబంధనలను ఖచ్చితంగా పాటించడంతో పాటు ప్రతి అంశాన్ని ముందుగానే పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని పటిష్ట భద్రతా బందోబస్తు ఏర్పాటు చేయాలని,ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని,కార్యక్రమ ప్రాంగణాల్లో తాగునీరు,విద్యుత్,పారిశుధ్యం, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.ప్రజలు,ప్రజాప్రతినిధులు, అధికారులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని వసతులు కల్పించాలని మంత్రి





పర్యటన సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ నూతన జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని ప్రారంభించడంతో పాటు,జిల్లా కేంద్రంలో నూతన ఆర్టీసీ బస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో ఆయా కార్యక్రమాలు విజయవంతంగా జరిగేలా జిల్లా యంత్రాంగం కార్యాచరణతో ముందుకు సాగుతోందని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి ఇమ్రాన్ మహమ్మద్, నాగర్ కర్నూల్ డిఎం యాదగిరి,అధికారులు, రవాణా శాఖ అధికారులు,టీజీఎస్ఆర్టీసీ అధికారులు,రోడ్లుభవనాల శాఖ ఇంజినీర్లు, పోలీసు అధికారులు,మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌కు ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ కల్వ భాస్కర్ బదిలీ

## – జిల్లా అధికారుల ఆత్మీయ వీడ్కోలు.. సేవలను కొనియాడిన అధికారులు

**మహబూబ్‌నగర్, జూలై 7 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ కల్వ భాస్కర్‌ను హైదరాబాద్‌కు బదిలీ చేస్తూ ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ (సీ జీ ఎం) ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయన కలెక్టరేట్ ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ పదవి నుంచి రిలీవ్ అయ్యారు.బదిలీపై వెళుతున్న కల్వ భాస్కర్‌కు జిల్లా అధికారులు ఆత్మీయంగా వీడ్కోలు పలికి, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. కల్వ భాస్కర్ జూన్ 2022 నుంచి జూన్ 2025 వరకు లీడ్ బ్యాంక్ మేనేజర్ గా విధులు నిర్వహించారు. ఈ కాలంలో బ్యాంకులు, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం పెంపొందిస్తూ వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద రుణాల మంజూరులో విశేష కృషి చేసి అధికారుల ప్రశంసలు అందుకున్నారు.జూలై 2025 నుంచి కలెక్టరేట్ ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టి జిల్లా అధికారులతో



సమన్వయంగా పనిచేశారు. వివిధ ప్రభుత్వ సమావేశాల్లో పాల్గొంటూ సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన కల్పించడం ద్వారా ప్రజల్లో చైతన్యం పెంచేందుకు కృషి చేశారు. ఈ సందర్భంగా సమాచార శాఖ సహాయ సంచాలకులు పి. శ్రీనివాస్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కె. రవీందర్, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్‌తో పాటు పలువురు జిల్లా అధికారులు కల్వ భాస్కర్‌ను ఘనంగా సన్మానించి, ఆయన భవిష్యత్ బాధ్యతల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ 32వ,ఆవిర్భావ దినోత్సవం

కేటీదొడ్డి జూలై 7(ప్రజా జ్యోతి):జోగులాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం గువ్వలదిన్నె గ్రామంలో ఎమ్మార్పీఎస్ 32వ,ఆవిర్భావ దినోత్సవంతో పాటు సంస్థ వ్యవస్థాపకులు,పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 60వ,జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంటర్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన కే.ఉమను సన్మానించడంతో పాటు జే.నర్సింలు,సీ.నర్సింలుకు హెల్మెట్లను పంపిణీ చేశారు.సమావేశంలో నాయకులు మాట్లాడుతూ,ఒక కులంతో ప్రారంభమైన ఎమ్మార్పీఎస్ ఉద్యమం నేడు అన్ని వర్గాల హక్కుల కోసం పోరాడే ఉద్యమంగా ఎదిగిందన్నారు. ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాల సాధనలో,అణగారిన వర్గాల సంక్షేమం కోసం మందకృష్ణ మాదిగ చేసిన కృషి ప్రశంసనీయమని కొనియాడారు.యువతకు ఎమ్మార్పీఎస్ ఉద్యమ చరిత్ర,ఆశయాలను తెలియజేసి వాటిని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు,రాజకీయ నాయకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.





## ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం,మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు



**వడ్డేపల్లి జూలై 7(ప్రజా జ్యోతి):**

ఎమ్మార్పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) ఆవిర్భావ దినోత్సవంతో పాటు సంస్థ వ్యవస్థాపకులు,పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను వడ్డేపల్లి మండల కేంద్రంలోని శాంతినగర్‌లో ఉన్న మాధవ సాయి క్లినిక్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు.ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఏసేపు మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రోగులకు పాలు,పండ్లు,బెడ్‌షీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,సామాజిక న్యాయం కోసం మూడు దశాబ్దాలకు పైగా మందకృష్ణ మాదిగ చేస్తున్న పోరాటం ఆదర్శనీయమని, అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కోయిల్దిన్నె శేఖర్,దుబ్బన్న ఓబులేసు,చెన్నిపాడు దుబ్బన్న,హుసేను తదితరులు పాల్గొన్నారు.

## మూడు ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసిన జిల్లా విద్యాశాఖాధికారి



**ధరూర్ జూలై 7(ప్రజా జ్యోతి):**

జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలంలోని ఎములోనిపల్లి,చిన్నచింతరేవుల,నర్సందొడ్డి ప్రభుత్వ పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి విజయలక్ష్మి సోమవారం సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు,నోట్ పుస్తకాల పంపిణీని పరిశీలించి,బేస్‌లైన్ టెస్ట్ నిర్వహించి విద్యార్థుల అభ్యాస స్థాయిని అంచనా వేసి,దానికి అనుగుణంగా బోధన చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు.అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి పఠన,రచన,గణిత నైపుణ్యాలను పరిశీలించారు.మధ్యాహ్న భోజన పథకం అమలును తనిఖీ చేసి ఆహారం నాణ్యత,పరిశుభ్రత,వంటశాల నిర్వహణ,మెనూ అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులకు పోషకాహారం నాణ్యతతో,సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు,విద్యార్థుల అభ్యాస పురోగతి,మౌలిక సదుపాయాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు.

## ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం

**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్**

మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఎమ్మార్పీఎస్ మండల కమిటీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల నాగరాజు మాదిగ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేసి శు భాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ గత 32 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణతో పాటు బలహీన వర్గాల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తుందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో బండారి విష్ణు మీసాల శీను మీసాల నాగన్న దేవుని గణేష్ రాధాకృష్ణ ప్రవీణ్ మీసాల శివ గడ్డమీది రవి రవితేజ వినోద్ కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు



# జోనల్ పోలీస్ డ్యూటీ మీట్ ఘనంగా ముగింపు

- విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేసిన జిల్లా ఎస్పీ దరావత్ జానకి
- రాష్ట్రస్థాయిలోనూ రాణించాలని ఆకాంక్ష




**మహబూబ్‌నగర్, జూలై 7 ( ప్రజా జ్యోతి బ్యూరో )**
జోగులాంబ జోన్--ఎ×× డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్, ఐపీఎస్ ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన జోనల్ లెవల్ పోలీస్ డ్యూటీ మీట్ --2026--27 మంగళవారం ఘనంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ జోనల్ డ్యూటీ మీట్‌లో జోన్--ఎ×× పరిధిలోని ఐదు జిల్లాలకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని సైంటిఫిక్ ఎయిడ్స్ టు ఇన్వెస్టిగేషన్, ఆంటీ - సబోటేజ్ చెక్, కంప్యూటర్ నాలెడ్జ్, డాగ్ స్క్వాడ్, ఫోటోగ్రఫీ ఒ వీడియోగ్రఫీ తదితర విభాగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జానకి మాట్లాడుతూ, జోనల్ స్థాయిలో విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌కు ఎంపికైన అధికారులు, సిబ్బంది అదే పట్టుదలతో రాష్ట్రస్థాయిలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జోన్--ఎ××కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇలాంటి డ్యూటీ మీట్‌లు పోలీసు సిబ్బందిలో వృత్తి నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, దర్యాప్తు సామర్థ్యాలను మరింత మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజయాలు సాధించి జోన్ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని విజేతలకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఆర్‌ఐలు కృష్ణయ్య, నగేష్, అశోక్ కుమార్, భూత్పూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణతో పాటు వివిధ జిల్లాలకు చెందిన అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు పూర్తి చేయండి

- బిఎల్ఏలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలి
- ఎమ్మెల్యే మేఘారెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి



**వనపర్తి, జూలై 7 (ప్రజాజ్యోతి):**
సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పిలుపునిచ్చారు. గోపాల్పేట మండల కేంద్రం సమీపంలోని మినీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏల అవగాహన సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. గోపాల్పేట, ఏదుల, రేవల్లి మండలాల్లో ఎస్ ఐ ఆర్ నమోదు ప్రక్రియ ఆశించిన స్థాయిలో జరగడం లేదని, ప్రతి బిఎల్ఏ తన బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తూ ఇంటింటికీ వెళ్లి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతిపక్ష పార్టీలు ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని ముందుకు సాగుతున్నాయని, అధికార పార్టీలో ఉండి నిర్లక్ష్యం ప్రదర్శించడం సమంజసం కాదన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమంపై కాంగ్రెస్ అధిష్ఠానం ప్రత్యేక దృష్టి సారించిందని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మిగిలి ఉన్న 20 రోజుల సమయాన్ని పూర్తిగా వినియోగించుకుని ప్రతిరోజూ ఉదయం 7 నుంచి 10 గంటల వరకు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించాలని సూచించారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి ప్రభుత్వంపై అవగాహన పెంచాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో దొంగ ఓట్ల నమోదుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే సమాచారం ఉందని, అలాంటి అక్రమాలను అప్రమత్తంగా గుర్తించి అడ్డుకోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పారదర్శకమైన, నిష్పాక్షికమైన ఓటరు జాబితా రూపొందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, బిఎల్ఏ లు, యువ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# ఓటర్ల హక్కుల పరిరక్షణే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

- బీఎల్‌ఏ-2లు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలి: ఎమ్మెల్యే మేఘారెడ్డి




**వనపర్తి, జూలై 7 (ప్రజాజ్యోతి):**
జిల్లాలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటర్ల సర్వే ప్రక్రియను సమన్వయంతో విజయవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన బీఎల్‌ఏ-2 ప్రతినిధుల సమావేశంలో వారు పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ, ఓటర్లకు అందజేసిన ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి స్థాయిలో పూరింపజేసి, ఎలాంటి పొరపాట్లు జరగకుండా బీఎల్‌ఏ-2లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఓటర్లకు ఏవైనా సందేహాలు ఉంటే కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా నివృత్తి చేసుకోవాలని తెలిపారు. బీఎల్‌ఏ-2లకు కేటాయించిన ఇన్‌చార్జులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. కొన్ని రాజకీయ పార్టీలు కాంగ్రెస్‌కు చెందిన ఓట్లను తొలగించే కుట్రలకు పాల్పడుతున్నాయని ఆరోపించిన ఆయన, అలాంటి ప్రయత్నాలను సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సమయం తక్కువగా ఉన్న నేపథ్యంలో తరచూ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కాంగ్రెస్‌కు అండగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ఓటర్ల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని పేర్కొన్నారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, సాయిచరణ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్టోజు బ్రహ్మచారి, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పాకనాటి కృష్ణయ్య, శరవంద, పట్టణ అధ్యక్షుడు కదిరె రాములు, మండల అధ్యక్షుడు నక్క రవికిరణ్, బీఎల్‌ఏ-2 ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యా,పరిపాలనా అంశాలపై ప్రధానోపాధ్యాయులకు దిశానిర్దేశం





**మల్దకల్ జూలై 7(ప్రజా జ్యోతి ప్రతినిధి):**
ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల విద్యా ప్రమాణాల మెరుగుదలతో పాటు పరిపాలనా వ్యవహారాల సమర్థ నిర్వహణ లక్ష్యంగా మల్దకల్ మండలంలోని అన్ని ప్రాథమిక,ప్రాథమికోన్నత,ఉన్నత,ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం మంగళవారం స్థానిక పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి జి. సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో యూడైస్ ప్లస్,ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్,పాఠ్యపుస్తకాలు,నోట్‌బుక్స్ పంపిణీ,విద్యార్థుల నమోదు,మధ్యాహ్న భోజన పథకం బిల్లులు,గ్యాస్ సిలిండర్ల లభ్యత,కిచెన్ గార్డెన్లు,ఉపాధ్యాయుల సెలవుల ఖాతాల నిర్వహణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.ప్రతి పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచడం,విద్యా ప్రమాణాలు మెరుగుపరచడం,ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం,రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి జి.సురేష్ ప్రధానోపాధ్యాయులకు సూచించారు.ఈ సమావేశంలో అమరవాయి కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ వి.నరేష్,డీసీఈబీ కార్యదర్శి జి.మహేష్,జీహెచ్‌ఎం ఓబులేష్,ప్రధానోపాధ్యాయులు క్రాంతికుమార్,వెంకటయ్య,రవికిరణ్,వెంకటేష్ ,కృష్ణ, గోవిందు,రాఘవేంద్ర గుప్తా,మండలంలోని ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,కంప్యూటర్ ఆపరేటర్ విజయ్,సీఆర్పీలు పద్మ,పరుమన్న తదితరులు పాల్గొన్నారు.

## నర్వలో ఘనంగా యాంకి పోలమ్మ బోనాలు

**నర్వ, జూలై 7 (ప్రజా జ్యోతి**
నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలో గ్రామ ప్రజలు మంగళవారం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు, ఈ సందర్భంగా గ్రామ ప్రజలు యాంకి పోలమ్మ అమ్మవారికి సంప్రదాయబద్ధంగా బోనాలు ఎత్తుకొని వెళ్లి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు తలపై బోనం కుండలను మోసుకుని డోలు, డప్పుల నడుమ భక్తి శ్రద్ధలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కోడి పుంజులు, గొర్రెపోతులను సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోగా, గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. యాదవ కులస్తులు ప్రతి ఏడాది ఈ బోనాలను తమ పెద్ద పండుగగా భావించి ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. గ్రామంలో సుఖశాంతులు నెలకొనాలని, సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. డోలు, డప్పుల సందడి, భక్తుల జైజైధ్వానాలతో నర్వ మండల కేంద్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ ఉత్సవాలలో కురుమ, యాదవ సంఘం నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు,



# పాలిటెక్నిక్, ఆలయానికి నిధుల కేటాయింపును స్వాగతిస్తున్నాం

- రూ.1000 కోట్ల హామీపై సమాధానం చెప్పాలి
- ప్రకటనలు కాదు.. అభివృద్ధి పనులు చూపించండి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ



**వనపర్తి, జూలై 7 (ప్రజాజ్యోతి):**
ప్రజలకు ఉపయోగపడే ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పాలిటెక్నిక్ కళాశాల పునరుద్ధరణకు రూ.10 కోట్లు, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.2 కోట్లు కేటాయించడాన్ని పార్టీ స్వాగతిస్తోందని తెలిపారు. అయితే, వనపర్తి నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ప్రకటించిన రూ.1,000 కోట్ల హామీ ఏమైందని ప్రశ్నించారు. ఇప్పటివరకు ఎంత నిధులు విడుదలయ్యాయి, ఏయే అభివృద్ధి పనులకు ఖర్చు చేశారు, పూర్తయిన ప్రాజెక్టులు ఏమిటన్న పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. రూ.1,000 కోట్ల హామీ ఇచ్చి, ప్రస్తుతం రూ.12 కోట్ల కేటాయింపునే గొప్ప విజయంగా ప్రచారం చేయడం ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నమని విమర్శించారు. నిజంగా అభివృద్ధి జరిగి ఉంటే చేపట్టిన పనుల జాబితా, విడుదల చేసిన నిధులు, పూర్తయిన పనుల వివరాలను ప్రభుత్వం వెల్లడించాలని కోరారు. ప్రకటనలు కాకుండా అమలు చేసిన పనులే అభివృద్ధికి నిజమైన నిదర్శనమని, వనపర్తి ప్రజలు హామీలు కాదు ఫలితాలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలుకు ఇప్పటికే 30 నెలలు గడిచినా అనేక హామీలు ఇంకా పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని వెంటనే అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీశైలం, మాజీ జెడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు శ్రీనివాస్ గౌడ్, జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, అధికార ప్రతినిధి నక్క మహేష్, 13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యకు పేదరికం అడ్డంకి కాదు

- ప్రతిభకు పబ్లిక్ క్లబ్ చేయూత
- ఐఐఐటీ విద్యార్థినికి రూ.28 వేల ఆర్థిక సాయం
-ఉన్నత విద్యకు అండగా నిలిచిన పబ్లిక్ క్లబ్ కార్యవర్గం



**నాగర్ కర్నూల్ జులై 7 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి )**
విద్యకు పేదరికం అడ్డు కాదని నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థిని రింగు కావ్య శ్రీ ఎందరో విద్యార్థి, విద్యార్థినీలకు ఆదర్శంగా నిలిచింది. మంగళవారం అచ్చంపేట పట్టణానికి చెందిన ప్రతిభావంతురాలు, నిరుపేద విద్యార్థిని రింగు కావ్య శ్రీ తండ్రి రింగు రవి ఉన్నత విద్యాభ్యాసానికి అచ్చంపేట పబ్లిక్ క్లబ్ చేయూతనిచ్చింది. పదో తరగతిలో 563 మార్కులతో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన రింగు కావ్యశ్రీ రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీస్ బాసర క్యాంపస్‌లో ఐఐఐటీ సీటు సాధించడం పట్ల క్లబ్ కార్యవర్గం అభినందనలు తెలిపింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆమె ఉన్నత విద్య కొనసాగింపులోఎదురవుతున్న సమస్యలను గుర్తించిన పబ్లిక్ క్లబ్ బృందం కార్యవర్గం సమావేశంలో విద్యార్థినికి క్లబ్ తరఫున రూ.10,000 ఆర్థిక సహాయం అందించాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. అదనంగా, కార్యవర్గ సభ్యులు తమ వ్యక్తిగత విరాళాల రూపంలో మరో రూ.18,000 అందజేయడంతో మొత్తం రూ.28,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా పబ్లిక్ క్లబ్ అధ్యక్షుడు అంగిరేకుల బిక్షపతి, ప్రధాన కార్యదర్శి కనోజు మనోహర్ ప్రసాద్ మాట్లాడుతూ, ప్రతిభకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో ఈ సహాయం అందించామని తెలిపారు. సమాజంలో ఉన్న దాతలు, సేవాభావం కలిగిన వ్యక్తులు కూడా ఇలాంటి ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యవర్గ సభ్యుల సేవాభావం, ఉదారత పట్ల క్లబ్ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయాన్ని పట్టణ ప్రముఖులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు విద్యార్థిని కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# కంటి చూపు లేనిది... జీవితం వ్యర్థం

- ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి
-ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**నాగర్ కర్నూల్ జులై 7 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**
సృష్టిలో జీవించే ప్రతి మానవునికి చూపు తప్పనిసరి అని, కంటి చూపు లేని జీవితం వ్యర్థమని స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ పేర్కొన్నారు మంగళవారం అచ్చంపేట పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఆవరణలో శ్రీ మహాలక్ష్మి మ్యాక్సీ విజన్ ఈహెచ్ఎస్ ఐ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ హాజరై,ప్రారంభించి తను కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఉదయం నుంచి నిర్వహించిన ఈ శిబిరానికి అచ్చంపేట పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి వందలాది మంది ప్రజలు హాజరై, కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ, "కంటి చూపు మనిషికి భగవంతుడు ప్రసాదించిన అమూల్యమైన వరం. చిన్నచిన్న సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ నిరంతరం కంటి పరీక్షలు చేయించుకోవాలి. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయి. అర్హులైన వారు ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో అందిస్తున్న ఉచిత శస్త్రచికిత్సల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని సూచించారు. శిబిరంలో వైద్య నిపుణులు ప్రతి ఒక్కరికీ సమగ్రంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, వైద్య సలహాలు అందించారు. కంటి శుక్లాలు (క్యాటరాక్ట్) ఉన్నట్లు గుర్తించిన రోగులకు ఉచిత శస్త్రచికిత్సలు నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన అర్హులకు శస్త్రచికిత్సలను పూర్తిగా ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పబ్లిక్ క్లబ్ అధ్యక్షుడు అంగరేకుల బిక్షపతి, ప్రధాన కార్యదర్శి కానోజు మనోహర్ ప్రసాద్ (మన్ను పటేల్) మాట్లాడుతూ, ప్రజలు కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. శిబిరం విజయవంతానికి సహకరించిన వైద్య బృందానికి, క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ క్లబ్ ఉపాధ్యక్షులు కందికొండ శ్రీధర్, కోశాధికారి పోకల ప్రవీణ్, కార్యవర్గ సభ్యులు, సభ్యులు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది, స్థానిక ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.



# ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి మంత్రి శ్రీహరి పరామర్శ.. అండగా ఉంటామని భరోసా



**నర్వ, జూలై 7 (ఆంధ్రజ్యోతి):**
మక్తల్ నియోజకవర్గం నర్వ మండలం యాంకి గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ అంజప్ప ఆకస్మిక మరణం పట్ల మంగళవారం రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంగళవారం అంజప్ప నివాసానికి వెళ్లిన మంత్రి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి అంజప్ప కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకుని, వారి సమస్యలను ఓపికగా విన్నారు. కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాల విషయంలో తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బిసం చెన్నయ్య సాగర్, ఎన్ఆర్ఐ పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు శరణప్ప, నాగన్నగారి శ్రీనివాస్ రెడ్డి, వివేకవర్ధన్ రెడ్డి, రైసూర్ శ్రీనివాస్ రెడ్డి, అశోక్ గౌడ్, అంజి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నర్వలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపన జరిగి 32 సంవత్సరాల పూర్తి

**నర్వ జులై 7 ప్రజా జ్యోతి**
నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద మంగళవారం ఎం ఆర్ పి ఎస్ జిల్లా నాయకులు గుడిసె వెంకటయ్య ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం కొనసాగింది, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థీంపబడి నేటికీ 32 సంవత్సరాలు పూర్తికానున్నదని ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ గారి ఆదేశాల సారంగా, ఈ జెండా కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు, ఈ సందర్భంగా ఎంఆర్పిఎస్ సీనియర్ నాయకు లు. భూతల కృష్ణయ్య మాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో 1994 లో ప్రకాశం జిల్లా ఈదుముడు గ్రామంలో 16 మంది దళిత యువకులతో ప్రారంభమైన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక కార్యక్రమం ఈనాటికి 32 సంవత్సరా లు గా సుదీర్ఘ ఉద్యమ పోరాటం గడిచిన సందర్భంగా సాధించిన స్ఫూర్తి ప్రయోజనాలను, ఏ బి సి డ లు వర్గీకరణ సాధన గురించి, సమాజంలో దళిత వర్గాలను ఏ విధంగా అణచివేశారు, ఎమ్మార్పీఎస్ ద్వారా మనకు అనుకూల చట్టాలు ఏ విధంగా సాధించుకున్నాము వివరించారు ఈ కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు, అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు దండు అయ్యప్ప, శరణప్ప, పాండురంగయ్య, కురుమూర్తి, జెట్రం బుడ్డన్న, ముత్యాల ఎంకటయ్య, తదితరులు పాల్గొన్నారు



# ఆయిల్ పామ్ సాగులో మహబూబ్‌నగర్‌కు కొత్త లక్ష్యాలు

**- 1,500 ఎకరాల లక్ష్యాన్ని తప్పక చేరుకోవాలి..**
**- శాఖల సమన్వయంతో సాగు విస్తరణ వేగవంతం చేయాలి: డీఆర్వో ఎ. నిర్మల**

**మహబూబ్‌నగర్, జూలై 7 ( ప్రజా జ్యోతి బ్యూరో )**
జిల్లాలో జాతీయ వంటనూనెల మిషన్--ఆయిల్ పామ్ పథకం కింద ఆయిల్ పామ్ సాగు విస్తరణను వేగవంతం చేసి, 2026--27 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో సాధించాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) ఎ. నిర్మల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉద్యానవన, వ్యవసాయ, సహకార శాఖల అధికారులు, మైక్రో ఇరిగేషన్ సంస్థలు, ప్రీ యూనిక్ ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధులతో నిర్వహించిన సమన్వయ సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో భారతీయ ఆయిల్ పామ్ పరిశోధనా సంస్థ సాంకేతిక బృందం గుర్తించిన 5,000 ఎకరాల సామర్థ్యంలో ఇప్పటికే 4,782 ఎకరాల్లో (96 శాతం) ఆయిల్ పామ్ సాగులోకి వచ్చిందని తెలిపారు. 2026--27 సంవత్సరానికి 1,500 ఎకరాల లక్ష్యం ఉండగా, ఇప్పటివరకు 260 మంది రైతులకు చెందిన 792 ఎకరాలకు పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయని చెప్పారు. అయితే వాటిలో కేవలం 31 మంది రైతులు మాత్రమే 130 ఎకరాల్లో తోటలు నాటారని, మిగిలిన లక్ష్యాన్ని సాధించేందుకు క్షేత్రస్థాయిలో చర్యలు మరింత వేగవంతం చేయాలని సూచించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి కె. వేణుగోపాల్ మాట్లాడుతూ, ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం భారీ సబ్సిడీలు, డ్రిప్ సౌకర్యం, మొక్కల పంపిణీ, కొనుగోలు హామీ వంటి అనేక ప్రోత్సాహకాలను అందిస్తోందని తెలిపారు. సంప్రదాయ పంటలతో పోలిస్తే ఆయిల్ పామ్ రైతులకు స్థిరమైన, ప్రతి నెలా ఆదాయం అందించే లాభదాయకమైన పంటగా మారుతోందని పేర్కొన్నారు. సాగు విస్తరణ కోసం ఉద్యాన అధికారులకు నియోజకవర్గాల వారీగా లక్ష్యాలు నిర్దేశించినట్లు వెల్లడించారు.జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్ మాట్లాడుతూ, నీటి వనరులు ఉన్న రైతులను గుర్తించి ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించాలని అసిస్టెంట్ అగ్రికల్చర్ డైరెక్టర్లు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులకు ఆదేశించారు. గ్రామాల వారీగా లక్ష్యాలను ఖరారు చేసి అమలు చేయాలని సూచించారు.జిల్లా సహకార అధికారి కృష్ణ మాట్లాడుతూ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ప్యాక్స్) ద్వారా రైతులకు ఆర్థిక సహాయం, ఎరువులు, పెట్టుబడి మద్దతు అందించే విధానాలను వివరించారు. ఆయిల్ పామ్ సాగు నమోదులో ప్యాక్స్ సీఈఓలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. సమావేశ ముగింపులో డీఆర్వో ఎ. నిర్మల మాట్లాడుతూ, ఉద్యానవన, వ్యవసాయ, సహకార శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రతి వారం నిర్దేశించిన లక్ష్యాల పురోగతిని సాధించాలని తెలిపారు. రైతుల దరఖాస్తుల నమోదు నుంచి డ్రిప్ పరికరాల అమరిక వరకు ప్రతి దశలో అధికారులు రైతులకు అండగా నిలవాలని స్పష్టం చేశారు. లాభదాయకమైన ఆయిల్ పామ్ సాగును జిల్లా వ్యాప్తంగా మరింత విస్తరించి రైతుల ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సహాయ వ్యవసాయ సంచాలకులు, వ్యవసాయ అధికారులు, ఉద్యాన అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఉద్యాన విస్తరణ అధికారులు, ప్యాక్స్ సీఈఓలు, మైక్రో ఇరిగేషన్, ఆయిల్ పామ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.




# మృతి చెందిన హోంగార్డ్ కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సహాయం

## కుటుంబానికి పోలీస్ శాఖ అండగా ఉంటుంది -- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్,



**నారాయణపేట ప్రతినిధి జూలై 07 (ప్రజా జ్యోతి)**
నారాయణపేట జిల్లా పోలీస్ శాఖలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన బాలకృష్ణ కుటుంబానికి జిల్లా పోలీస్ శాఖ మానవతా దృక్పథంతో అండగా నిలిచి హోంగార్డ్లు లు సేకరించిన విరాళం. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, చేతుల మీదుగా మృతుడి భార్య భవానికి రూ.50,000లు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.నారాయణపేట జిల్లాలో హోంగార్డుగా విధులు నిర్వహించిన బాలకృష్ణ, కొత్తపల్లి మండలం గోకుల్ నగర్‌కు చెందినవారు. ఆయన ఆకస్మిక మరణంతో భార్య భవాని, ముగ్గురు చిన్నారులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఈ విషయాన్ని తెలుసుకున్న హోంగార్డ్ అధికారులు, సిబ్బంది, బ్యాచ్ మిత్రులు తమ తోటి సహచరుడి కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించి స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ... పోలీస్ కుటుంబంలో ఎవరికైనా కష్టం వచ్చినప్పుడు అందరూ ఒక్కటిగా నిలబడటం పోలీస్ శాఖ గొప్ప సంప్రదాయమని అన్నారు. బాలకృష్ణ సేవలను గుర్తు చేసుకుంటూ, ఆయన కుటుంబానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే, తమ సహచరుడి కుటుంబానికి చేయూత అందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించిన హోంగార్డ్ అధికారులు, సిబ్బంది, బ్యాచ్ మిత్రులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. వారి సేవాభావం, మానవత్వం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.మృతుడి కుటుంబ సభ్యులు ఈ ఆర్థిక సహాయం అందించిన జిల్లా ఎస్పీతో పాటు హోంగార్డ్ అధికారులు, సహచర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో హోంగార్డ్ సిబ్బంది, మృతుడి కుటుంబ సభ్యులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

**ఆశ అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి డాక్టర్ రాజశేఖర్**

**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్**
జులై 13న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ఆశా వర్కర్లు అంగన్వాడీ టీచర్లు సమన్వయంతో పనిచేయాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ సూచించారు సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి అర్హులైన చిన్నారికి నులిపురుగుల నివారణ మాత్రలు అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం ఆశ డే సందర్భంగా ఆశ కార్యకర్తల సేవలను అభినందించిన ఆయన మాత శిశు సంరక్షణ గర్భిణీల నమోదు సంస్థగత ప్రసవాలు 100 శాతం టీకాల పూర్తిచేసేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలన్నారు.కుటుంబ నియంత్రణ క్షయవ్యాధి నియంత్రణ దీర్ఘకాలిక వ్యాధులు అంటూ వ్యాధులు పర్యవేక్షణ తదితర ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు గర్భిణీల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యులు డా. శ్వేత డా. కరణ్ డా. భాగ్యశ్రీ డా. కవిత డా మౌనిక కలమ్మ ఆశ వర్కర్లు అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



# బాడీ బిల్డింగ్ లో నాగర్ కర్నూల్ యువకుడి ప్రతిభ

**-ఆల్ఫా మజిల్ క్లబ్ నేషనల్ పోటీలో మొదటి స్థానం**






**నాగర్ కర్నూల్ : జూలై 07 (ప్రజా జ్యోతి)**
నాగర్ కర్నూల్ పట్టణానికి చెందిన సయ్యద్ ఫెరోజ్ అనే యువకుడు హైదరాబాద్ లోని బిర్లా ఆడిటోరియంలో ఆల్ఫా మజిల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీలలో ఓవరాల్ నేషనల్ ఛాంపియన్ గా నిలిచాడు.ఆల్ఫా మజిల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి న్యాచురల్ షోలో సయ్యద్ ఫెరోజ్ మెన్స్ ఫిజిక్ ఓవరాల్ టైటిల్ ను,బాడీ బిల్డింగ్ ప్రో కార్డ్,క్లాసిక్ ఫిజిక్ ప్రో కార్డు,మెన్స్ ఫిజిక్ లో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించి బాడీ బిల్డింగ్ లో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం,క్లాసిక్ ఫిజిక్ లో రెండవ స్థానంలో వెండి పతకాన్ని సాధించాడు.ఓ ప్రైవేట్ జిమ్ లో ట్రైనర్ గా ఉన్నఫిరోజ్ ఓవరాల్ ఛాంపియన్ గా బాడీ బిల్డింగ్ లో నాగర్ కర్నూల్ పట్టణానికి పేరు ప్రఖ్యాతలు తెవడంతో సయ్యద్ ఫిరోజ్ ను వివిధ సంఘాలు,క్రీడాకారులు,స్వచ్ఛంద సంస్థలు,యువజన సంఘ
సభ్యులు అభినందించారు.

# ఆరుగురు కమ్యూనల్ హిస్టరీ షీటర్ల బైండోవర్



**నారాయణపేట ప్రతినిధి జూలై 07 (ప్రజా జ్యోతి)**
నారాయణపేట ప్రజల్లో శాంతిభద్రతలు నెలకొల్పడం, సామాజిక సామరస్యాన్ని కాపాడడం, నేరాల నియంత్రణను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా నారాయణపేట టౌన్ పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, ఆదేశాల మేరకు, నారాయణపేట టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కమ్యూనల్ హిస్టరీ షీటర్లుగా నమోదైన ఆరుగురిని నారాయణపేట మండల తహసీల్దార్ (ఎంఆర్ఓ) అమరేంద్ర కృష్ణ ఎదుట హాజరుపరిచి బైండోవర్ నిర్వహించారు.నారాయణపేటలో భవిష్యత్తులో ఎలాంటి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడకుండా, సామాజిక సామరస్యాన్ని కాపాడాలని సంబంధిత వ్యక్తులకు హెచ్చరికలు జారీ చేసి, చట్టాన్ని గౌరవిస్తూ సజావుగా ప్రవర్తించాలని సూచించారు.ఈ సందర్భంగా ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలు, మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు, గొడవలు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ముందస్తు నివారణ చర్యల్లో భాగంగానే బైండోవర్ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు.పోలీస్ శాఖ ప్రజల భద్రత, శాంతి పరిరక్షణ కోసం ఎల్లప్పుడూ అప్రమత్తంగా పనిచేస్తుందని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఎలాంటి రాజీ లేకుండా చర్యలు కొనసాగుతాయని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

# ఇంటింటికి ఎస్ఐఆర్ సర్వే దరఖాస్తుల స్వీకరణ



విపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్. మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో ఎస్ ఐ ఆర్ సర్వేలో భాగంగా గ్రామాలలో బి ఎల్ ఓ లు బిఎల్ఎ లు కోఆర్డినేటర్లు ఇంటింటికి తిరుగుతూ ప్రజల నుంచి దరఖాస్తు స్వీకరించారు అర్హుల వివరాలను నమోదు చేసి అవసరమైన పత్రాలను పరిశీలించారు సర్వేను పారదర్శకంగా నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు చేపట్టారు ప్రజలు సర్వేకు పూర్తి సహకారం అందించి అవసరమైన వివరాలను సకాలంలో అందించాలని అధికారులు ప్రజలను కోరారు.

# కోటకొండ ప్రగతి చేనేత సొసైటీ అధ్యక్షులుగా సౌడం నరసింహులు ఎన్నిక



**నారాయణపేట ప్రతినిధి జూలై 07 (ప్రజా జ్యోతి)**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం చేనేత సహకార సంఘాల ఎన్నికలు నిర్వహిస్తున్నది. దీంట్లో భాగంగా నారాయణపేట జిల్లా నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలో ఈరోజు శ్రీ ప్రగతి హ్యాండ్లూమ్ వీవర్స్ కోపరేటివ్ సొసైటీ ఎన్నికలు ఎన్నికల అధికారి అసిస్టెంట్ రిజిస్టర్ శ్రీమతి జి లావణ్య ఆధ్వర్యంలో నిర్వహించింది. ఏకగ్రీవంగా 9 మంది డైరెక్టర్లను ఎన్నుకోవడం జరిగింది. అందులో కోటకొండ ప్రగతి చేనేత సహకార సొసైటీ అధ్యక్షులుగా సౌడం నర్సింలు ను 9 మంది డైరెక్టర్లు కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఉపాధ్యక్షులుగా చందులాల్, ప్రధాన కార్యదర్శిగా గంగుండి భాస్కర్,కోశాధికారిగా శీలం మల్లేష్ ,డైరెక్టర్లుగా భోగం అశోక్, మిట్టి రేణుక, సాకలి శివప్ప, కర్లీ శ్రీదేవి, శ్రీరామ్ చంద్రశేఖర్ బొమ్మను పాడు గార్లను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సౌడం నరసింహులు మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి చేనేత కార్మికులు నన్ను అధ్యక్షులుగా ఎన్నికైనందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో చేనేత కార్మికులకు అండగా వాళ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు అందించే పథకాలు ప్రతి కార్మికులకి అందేరకంగా ప్రయత్నం చేస్తానన్నారు. నూతనంగా ఎన్నుకున్న అధ్యక్షులు చౌడం నర్సింహులను డైరెక్టర్లను మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు చిట్టెం మాధవరెడ్డి, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి బి రాము, సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు సాగర్, గ్రామ సర్పంచ్ వెంకట రాములు గౌడ్, మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు కాశీనాథ్, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వేపూరు రాములు, మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు యాదగిరి, అంబాదాస్, వెంకట రాములు, హాజీ మల్లన్, నీలి దామోదర్, చాకలి లాలూ ప్రసాద్, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, చేనేత కార్మికులు పాల్గొని శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు ప్రముఖులు పాల్గొన్నారు.

# పూడూరులో ఘనంగా ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం

**మందకృష్ణ మాదిగ జన్మదినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ**



**గద్వాల (ప్రజా జ్యోతి) జూలై 07:**

జోగులాంబ గద్వాల జిల్లా పూడూరు గ్రామంలో ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం మరియు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించిన నాయకులు,కార్యకర్తలు ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ,మాదిగల హక్కుల సాధన కోసం ఎమ్మార్పీఎస్ ఎన్నో సంవత్సరాలుగా పోరాటం చేస్తోందని, మందకృష్ణ మాదిగ నాయకత్వం దళిత సమాజానికి దిశానిర్దేశం చేస్తోందని పేర్కొన్నారు.అలాగే,సామాజిక న్యాయం సాధనలో ఎమ్మార్పీఎస్ పాత్ర విశేషమని,ఉద్యమ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం పూడూర్ గ్రామస్తులు బి.అయ్యన, ఆనందరావు,ఆశన్న, కిట్టు,రాములు,నరేందర్ రెడ్డి,రాఘవేంద్ర,గద్వాల ఎంఆర్పిఎస్ నాయకులు గంజిపేట శంకర్, పరుశు రాముడు, అశోకు,కొంకల భీమన్న, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలలపై సిఐటియు ఎస్ఎఫ్ఐ సంఘాల సర్వే.







**నారాయణపేట ప్రతినిధి జూలై 07 (ప్రజా జ్యోతి)**

నారాయణపేట పట్టణ కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలలలో కనీస వసతుల కల్పన మరియు ఫీజుల వివరాలు తదితర అంశాలపై మంగళవారం రోజు సిఐటియు ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు .ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బండమీది బలరాం మాట్లాడుతూ నారాయణపేట పట్టణ కేంద్రంలోని చాలా ప్రైవేట్ పాఠశాలలకు తగినంతగా ఆట స్థలాలు లేవని లాబరేటరీలు లైబ్రరీలు, కంప్యూటర్ తదితర సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుండి నర్సరీ నుండి టెన్త్ వరకు వేలాది రూపాయలు వసూలు చేస్తున్న యాజమాన్యం ప్రైవేట్ పాఠశాలల యజమాన్యం ఆ స్థాయిలో వసతులు కల్పించడంలో విఫలమవుతున్నారని విమర్శించారు .నాణ్యమైన విద్య అందించాలని డిమాండ్ చేశారు . ట్రేనుడు టీచర్లను మాత్రమే నియమించుకోవాలని అన్నారు. పాఠశాలలో పాఠ్యపుస్తకాలు అమ్మకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ యజమాన్యం బేఖాతర్ చేస్తున్నాయని విమర్శించారు. పిల్లల సంఖ్యను బట్టి పాఠశాలలో మంచినీరు , మూత్రశాలలు మరుగుదొడ్లు కల్పించడం లేదని అన్నారు.పాఠశాలల బస్సుల ఫిట్‌నెస్ ను రవాణ శాఖ అధికారులు తనిఖీలు చేలన్నారు. కనీస వసతులు కల్పించని ప్రవేట్ పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని . అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో తమ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు.ఈ సర్వేలో సిఐటియు జిల్లా నాయకులు నరహరి, వికలాంగుల హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి కే కాశప్ప, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుండెగారి దస్తప్ప ,డివై ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షులు గోటూరు మల్లేష్,ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పవన్ కుమార్, సిపిఎం సోషల్ మీడియా వారియర్ సోఫీ మజార్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు

# అలంపూర్ నియోజకవర్గానికి ముగ్గురు ఎస్ఐల నియామకం





**అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతి) జూలై 07:**

జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజక వర్గంలోని మూడు మండలాలకు కొత్తగా నియమితులైన ఎస్ఐలు రాజోలి,ఐజ,ఉండవల్లి, పోలీస్ స్టేషన్ లకు కొత్త రాజోలి పోలీస్ స్టేషన్ కి కిరణ్ కుమార్, ఐజ పోలీస్ స్టేషన్ కి గురుస్వామి,ఉండవల్లి పోలీస్ స్టేషన్ కి సురేష్,లు బాధ్యతలు చేపట్టడం జరిగింది. మంగళవారం అలంపూర్ మాజీ ఎమ్మెల్యే ఏఐసిసి ప్రధాన కార్యదర్శి అలంపూర్ డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్ నీ మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది



# చెస్ లో మెరిసిన.. కందునూలు ఆశా కిరణం

**- జాతీయస్థాయిలో 17వ ర్యాంక్**
**- అభినందించిన పాఠశాల బృందం**

నాగర్ కర్నూల్ జులై 7( ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిది )

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన గీతాంజలి నర్సరీ... మూడో తరగతి విద్యార్థి లవిక్ రామ్, చెస్ చాంపియన్షిప్ నేషనల్ లెవెల్ లో విద్యార్థి, ప్రతిభ కనబరిచి, ఆశ కిరాణంలా 17వ స్థానంలో నిలవడం..అభినందనీయమన్నారు . అదే మాదిరిగా 17 స్థానంలో నిలిచి, అంతర్జాతీయ చెస్లో పాల్గొనే విధంగా మంగళవారం అర్హత సాధించడం కందునూలుకే గర్వకారణం అన్నారు. చిన్నారి చెస్లో ప్రావీణ్యం సాధించి, తమతో చదువుతున్న విద్యార్థులతో పాటు సమాజంలోని ఎంతో వేలమందిచిన్నారులకుఆదర్శనీయమన్నారు. ఈ చిన్నారి రాబోయే రోజుల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని గీతాంజలి పాఠశాల బృందం ఆకాంక్షించారు. పాఠశాల బృందం లవిక్ రామ్ కి మెమోటో ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ చిన్నారి జాతీయస్థాయిలో 17వ స్థానం సాధించి కందునూల్ పేరు ప్రతిష్టలను జాతీయస్థాయికి పరిచయం చేయడం అభినందనీయమన్నారు ఈ కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ సి నరేష్, ప్రిన్సిపల్ రిమ్స్ జుమార్, స్కూల్ చిన్నారులు ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు

